సాక్షి నల్లగొండ

బుధవారం ॥ 6 ॥ ఆగస్టు ॥ 2025



మన చేనేత.. ఘనత

కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు చేనేత కళాకారులు ఎంపికయ్యారు. - 10లో



నకిరేకల్‌లో కార్డెన్ సెర్చ్

నకిరేకల్ పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :		590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	:	587.20 అడుగులు
ఇన్‌ఫ్లో	:	44,880 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	44,880 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	29,151 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	5,088 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	8,541 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

తిప్పర్తి : పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలు, గుర్తు తెలియని వాహనాలను అమ్ముతున్నారని, సెటిల్‌మెంట్లు చేసి డబ్బులు తీసుకుంటున్నారని తేలడంతో తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లోని ఇద్దరు కానిస్టేబుళ్లు వసీం, ఉపేందర్‌పై ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సస్పెన్షన్ వేటు వేశారు. సదరు కానిస్టేబుళ్లు ఇటీవ ఒక గుర్తుతెలియని బైక్‌ను మెకానిక్ వద్ద మరమ్మతు చేయించి ఓ వ్యక్తికి విక్రయించారు. ఆ డబ్బు పంపకాల్లో ఇద్దరు కానిస్టేబుళ్ల మధ్య రూ.500 తేడా వచ్చింది. దీంతో విషయం అందరికి తెలిసింది. దీనిపై తిప్పర్తి ఎస్‌ఐ శంకర్.. ఎస్పీకి నివేదిక పంపారు. విచారణన చేపట్టిన ఎస్పీ ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని తిప్పర్తి ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేరాలి



మాట్లాడుతున్న భీమ్‌సింగ్

దిండి : ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే చేరాలని రాష్ట్ర ఇంటర్ బోర్డు అధికారి భీమ్‌సింగ్ సూచించారు. మంగళవారం డిండిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ కళాశాలల్లో ఎంసెట్, నీట్ ప్రవేశపరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. ఆయన వెంట అధ్యాపకులు ఆంజనేయులు, సంతోష్‌కుమార్, శ్రీరాములు, హన్మంతు, లింగస్వామి, ప్రేమానందం, జానయ్య తదితరులు ఉన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేయొద్దు



మాట్లాడుతున్న ఖమ్మంపాటి శంకర్

అడవిదేవులపల్లి : విద్యారంగాన్ని నిర్వీర్యం చేయొద్దని ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన 'సంక్షేమ హాస్టళ్ల సంరక్షణ– ప్రభుత్వ విద్యా పరిరక్షణ' పేరుతో చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేవన్నారు. అడవిదేవులపల్లి కేజీబీవీకి ప్రహరీ గోడలు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత తెలంగాణాకు విద్యా శాఖ మంత్రి కూడా లేకుండా పోయాడని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర సైదానాయక్, కుంచం కావ్య, స్పందన, రవీందర్ ఉన్నారు.



మూసీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న వరదనీరు

మూసీ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో మంగళవారం రెండు క్రస్ట్ గేట్లను పైకెత్తి వరదనీటిని దిగువకు వదిలారు. హైదరాబాద్ నగరంతో పాటు మూసీ ఎగువ ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురవడంతో మంగళవారం ఉదయం 415 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సాయంత్రానికి ఒక్కసారిగా 3,900 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో రెండు క్రస్ట్‌గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 2500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టుకు 356 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 642.90 అడుగులు (3.91 టీఎంసీలు)గా ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మూసీ గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలినందున నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని మూసీ తీర ప్రాంతం వెంట ఉన్న 42 గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట డివిజన్–1 నీటిపారుదలశాఖ ఈఈ వెంకటరమణ సూచించారు.

సీ పోర్టుకు.. సీఎంఆర్!

2.75 లక్షల క్వింటాళ్ల బియ్యం కాకినాడకు తరలింపు

- జిల్లాలోని ఆరు మిల్లుల్లో అక్రమాలు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందిన ఫిర్యాదు
- విచారణ చేపట్టిన పౌరసరఫరాల శాఖ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ప్రభుత్వానికి రావాల్సిన కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పక్కదారి పడుతోంది. ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యానికి సంబంధించి మిల్లర్లు కొందరు సీఎంఆర్ ఇవ్వకుండా ఆ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలించి విదేశాల్లో విక్రయించి రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. జిల్లాలోని ఆరు మిల్లులు సీఎంఆర్ పక్కదారి పట్టించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగింది. ఈ అక్రమాన్ని నిగ్గు తేల్చేందుకు సిద్ధమైంది.

మిల్లుల్లో లేని 4.15 లక్షల క్వింటాళ్ల ధాన్యం

జిల్లాలోని ఆరు మిల్లుల్లో 4.15 లక్షల క్వింటాళ్లకు పైగా ధాన్యం మిల్లుల నుంచి మాయమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. గత జనవరిలో అధికారులు ఆయా మిల్లుల్లో తనిఖీ చేసినప్పుడు కూడా ధాన్యం క్షేత్రస్థాయిలో లేవని తేలింది. ఆ ధాన్యానికి సంబంధించిన 2.75 లక్షల క్వింటాళ్ల బియ్యం కాకినాడ పోర్టుకు తరలినట్లు తెలిసింది.

15 రోజుల్లో సీఎంఆర్ ఇవ్వాలి..

ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు ఇస్తే, ఆ ధాన్యం అందిన 15 రోజుల్లో మిల్లర్లు వాటిని మర ఆడించి సీఎంఆర్ కింద తిరిగి సివిల్ సప్లయ్ శాఖకు క్వింటా ధాన్యానికి 68 కిలోల బియ్యాన్ని అందించాలి. కానీ జిల్లాలోని నల్లగొండ, మునుగోడు, చిట్యాల ప్రాంతాలకు చెందిన ఆరు మిల్లుల యజమానులు ఆ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకుండా కాకినాడ పోర్టుకు తరలించినట్లు తెలిసింది. దీనిపై గతంలోనే అధికారులకు ఫిర్యాదులు అందినా, తనిఖీల్లో ధాన్యం లేదని తేలినా అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోయింది. రూ.కోట్ల రూపాయల సీఎంఆర్ ఏళ్ల తరబడి ప్రభుత్వానికి ఇవ్వకున్నా స్పందించకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం అమ్ముకుంటున్న మిల్లులు

జిల్లాలో పలు మిల్లులు ఇప్పటికే పీడీఎస్ బియ్యం దందా చేస్తుండగా, ఇప్పుడు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని అమ్ముకుంటున్నాయి. ప్రభుత్వాన్ని మోసం చేస్తూ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నా సంబంధిత అధికారులు మిల్లర్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వారి అండదండలతోనే 2022–23 నుంచి 2024–25 యాసంగి సీజన్ వరకు ఇవ్వాల్సిన సీఎంఆర్ ఇవ్వకపోగా, అందులో కొంత వేలం వేసిన ధాన్యానికి సంబంధించి ధాన్యాన్ని కూడా అప్పగించకుండా, డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం చేకూర్చి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆ ఆరు మిల్లులపై ఎన్నో ఆరోపణలు

- జిల్లా కేంద్రానికి సమీపంలోని మండలానికి చెందిన ఓ మిల్లుకు 2022–23 యాసంగి సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ కోసం 1,18,132 క్వింటాళ్ల ధాన్యం ఇవ్వగా, 30,450 క్వింటాళ్ల బియ్యం ఇచ్చింది. అయితే గతేడాది ఆ మిల్లుల్లో మిగిలి ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం వేలం వేయడంతో 13,789 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలుదారుడు తీసుకెళ్లారు. ఇంకా మిల్లులో 59,539 క్వింటాళ్ల ధాన్యం మిల్లులో ఉండాల్సి ఉన్నా అక్కడ లేనట్లు తెలుస్తోంది.
- నల్లగొండకు చెందిన ఓ మిల్లుకు కేటాయింపు, ఇచ్చింది పోగా, ఇంకా 3,17,492 క్వింటాళ్ల ధాన్యం మిల్లులో ఉండాల్సి ఉన్నా అక్కడ 2,39,381 క్వింటాళ్లే ఉందని, 78,110 క్వింటాళ్ల ధాన్యం మాయం అయిందన్న ఆరోపణలు ఉన్నాయి.
- మునుగోడుకు చెందిన ఓ మిల్లులోనూ 4,500 క్వింటాళ్ల ధాన్యం, నల్లగొండలోని ఇంకో మిల్లులో ఉండాల్సిన 34,622 మెట్రిక్ టన్నుల ధాన్యం పక్కదారి పట్టించారని తెలుస్తోంది.
- నల్లగొండకు చెందిన మరో మిల్లులోనూ 1,59,803 క్వింటాళ్లు, మరో మిల్లులో 79,133 క్వింటాళ్ల ధాన్యం ఉండాల్సి ఉన్నా, దానిని ఆయా మిల్లులు పక్కదారి పట్టించినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి.

గుణాత్మక విద్య అందించాలి



మర్రిగూడ కేజీబీవీలో విద్యార్థినులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

మర్రిగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మంగళవారం ఆమె మర్రిగూడలోని కేజీబీవీని సందర్శించి పాఠశాలలో పారిశుద్ధ్యం, విద్య, భోజనం, వసతి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని అంతేకాకుండా నాణ్యమైన భోజనం అందించాలన్నారు. తరగతి గదిలో విద్యార్థినులకు పాఠాలు బోధించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అంతకుముందు మర్రిగూడలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని డయాలసిస్ యూనిట్, ఇతర విభాగాలను పరిశీలించి ఓపీ, ఐపీ, ఏఎన్‌సీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆస్పత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆమె వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ మాత్రునాయక్, చండూరు ఆర్డీఓ వి.శ్రీదేవి, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, సూపరింటెండెంట్ శంకర్‌నాయక్, ఎస్‌ఓ జ్యోతి, వైద్యురాలు శాలిని, హరిప్రియ, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఇందిరమ్మ ఇళ్లను గ్రౌండింగ్ చేయాలి

నల్లగొండ : ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌ను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయడంతో పాటు, లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థికస్తోమత లేకపోతే స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం ఇప్పించాలన్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటరు జాబితాను ఆధునీకరించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, డీపీఓ వెంకయ్య, డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, గనుల శాఖ ఏడీ శామ్యూల్ జాకబ్ పాల్గొన్నారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ విషం చిమ్ముతోంది



కాళేశ్వరంపై హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను నల్లగొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వీక్షిస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ పేరుతో విషం చిమ్ముతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను నల్లగొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన.. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్, రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, నాయకులతో కలిసి వీక్షించారు. అనంతరం రవీంద్రకుమార్ విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరంపై హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంషన్‌లో చాలా స్పష్టంగా కాంగ్రెస్ కుట్రలను ఎండగట్టారని తెలిపారు. ప్రాజెక్టులు ఏం జరగకపోయినా జరిగినట్లు సీఎం రేవంత్‌రెడ్డి అభూతకల్పన సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అన్ని అనుమతులతో గోదావరిపై బ్యారేజీలు నిర్మించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కాళేశ్వరంపై కమిషన్ రిపోర్ట్ కూడా ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని, పూర్తి అబద్ధాలు చెప్పారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, చీర పంకజ్‌యాదవ్, అభిమన్యు శ్రీనివాస్, సింగం రామ్మోహన్, బక్క పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నల్లగొండ : ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడిచినా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. విద్యలో కార్పొరేట్ శక్తులను నియంత్రించకపోవడం వల్ల సామాజిక అంతరాలు పెరిగిపోయాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చి హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే దశలవారీ ఉద్యమంలో భాగంగా ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో యూఎస్‌పీఎస్‌సీ నాయకులు బక్క శ్రీనివాసచారి, రత్నయ్య, వెంకటేశం, జి.నాగమణి, పెరుమాళ్ల వెంకటేశం, పి.వెంకులు, ఖుర్షిద్‌మియా, నర్రా శేఖర్‌రెడ్డి, వడ్త్యా రాజు, జి.అరుణ, యాట మధుసూదన్‌రెడ్డి, మురళయ్య, పగిళ్ల సైదులు, కొమర్రాజు సైదులు, గణేష్, అంజయ్య, లక్ష్మయ్య, జగతి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఫ్రెండ్లీ పోలీసింగ్ ఎక్కడ?

జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఇటీవల పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో భాగంగా బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి పరీక్షించారు. అతను మద్యం తాగినట్లు గుర్తించామని పోలీసులు చెప్పారు. అయితే ఆ సమయంలో బైక్‌తోపాటు అతని సెల్‌ఫోన్‌ను కూడా లాక్కొని పోలీసులు దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. దాంతో ఆ వ్యక్తి పోలీసు స్టేషన్‌కు వచ్చి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. అక్కడున్న హోంగార్డు, మరో కానిస్టేబుల్ మంటలు ఆర్పి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మరణించాడు. అతని మరణానికి కారణం పోలీసుల దురుసు ప్రవర్తనేనని బీజేపీ నేతలు ఆందోళన నిర్వహించారు. విచిత్రం ఏంటంటే.. ఆ వ్యక్తి తమ విధులకు ఆటంకం కలిగించాడంటూ పోలీసులు అదేరోజు రాత్రి కేసు నమోదు చేశారు.

చింతపల్లి మండలం కుర్మేడ్ గ్రామంలో తాము కొనుగోలు చేసిన భూమి విషయంలో చింతపల్లి ఎస్సై రామ్మూర్తి తమపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారంటూ టీవీ నటి శిల్పా చక్రవర్తి, ఆమె భర్త జడ కల్యాణ్ యాకయ్య హైకోర్టును ఆశ్రయించారు. ఎదుటి వారితో కుమ్మక్కై భూవివాదం సెటిల్ చేసుకోవాలంటూ తమ వేధిస్తున్నారని పేర్కొన్నారు. సివిల్ కోర్టు ఇంజక్షన్ ఉన్నా పోలీసుల సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోవడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది.

తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారంటూ గతేడాది శాలిగౌరారం ఎస్సైపై ఓ మహిళ ఫిర్యాదు చేశారు. కుటుంబ వివాదంలో పోలీసుస్టేషన్‌కు వెళ్లిన మహిళపై అనుచితంగా ప్రవర్తించిన ఎస్సైపై ఎస్పీ విచారణ జరిపించి చర్యలు తీసుకున్నారు.



సాక్షి ప్రతినిధి, నల్లగొండ:

ఉమ్మడి జిల్లాలో ఫ్రెండ్లీ పోలిసింగ్ గాడి తప్పుతోంది. కొందరు పోలీసులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పోలీసుల వేధింపుల కారణంగా బాధితులు ఆత్మహత్య చేసుకుంటున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. బాధితుల ఫిర్యాదులతో బయటకు వస్తున్న సంఘటనలు కొన్నే. పోలీస్ స్టేషన్లలోనే పంచాయతీలు, సెటిల్‌మెంట్లు చేస్తూ దండుకుంటున్న వారు కొందరైతే, సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకొని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారు మరికొందరు. అదీ చాలదన్నట్లు ఇంకొందరైతే మహిళల పట్ల అనుచితంగా వ్యవహరిస్తూ పోలీసు శాఖకే మచ్చ తెస్తున్నారు. వివిధ సందర్భాల్లో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సస్పెండ్ చేయడం, ఎస్పీ కార్యాలయాలకు అటాచ్ చేయడం వంటి చర్యలు చేపడుతున్నా అలాంటి వారిలో మార్పు రావడం లేదు. పైగా రాజకీయ పలుకుబడితో కొద్దిరోజుల్లోనే తిరిగి పోస్టింగ్ పొందుతున్నారు.

- బాధితులు ఆత్మహత్యకు పాల్పడేంతగా పోలీసుల దురుసు ప్రవర్తన, వేధింపులు
- భూ వివాదాల్లో జోక్యం.. అవినీతి, అక్రమ దందాలు
- మహిళల పట్ల అనుచిత ప్రవర్తన
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నా మారని ఖాకీల తీరు
- ఉమ్మడి జిల్లాలో పలువురు ఎస్సైలు, సీఐలపై ఆరోపణలు

ముడుపులే లక్ష్యంగా దందాలు

కొందరు ఎస్సైలు, కానిస్టేబుళ్లు రాజకీయ నేతల అండదండలతో అవినీతి దందా కొనసాగిస్తున్నారు. ఏదైనా కేసు విషయంలో పోలీసు స్టేషన్‌కు వెళితే చాలు న్యాయ అన్యాయాలు పట్టించుకోకుండా, ముడుపులు ముట్టజెప్పిన వారికి వంతపాడుతూ బాధితులను వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. యాదాద్రి జిల్లా మోత్కూర్ మండలంలో గతంలో పనిచేసిన ఓ ఎస్సై భూవివాదాల్లో మితిమీరిన జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. తనకు ఎదురు తిరిగిన వారిపై చేయి చేసుకోవడం బెదిరింపులకు పాల్పడడం, అక్రమ కేసులను పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని ముసిపట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పోలీసు స్టేషన్‌లో బంధించి చితకబాదడమే కాకుండా, ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారిపైనా చేయి చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

చర్యలు చేపడుతున్నా తీరు మారట్లే..

- జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన సంధ్యకు యాదాద్రి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలంలోని మరిపిరాల గ్రామానికి చెందిన కృష్ణతో ఏడాదిన్నర కిందట వివాహమైంది. ఇద్దరి మధ్య తరచూ గొడవలు రావడంతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. అయితే ఎస్సై తనను వేధింపులకు గురిచేస్తున్నారంటూ మే నెల 20వ తేదీన ఆమె మండల కేంద్రంలోని వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనలో మృతురాలి బంధువులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు ఎస్సైని బదిలీ చేశారు.
- సూర్యాపేట జిల్లాలో నకిలీ డాక్టర్ల కేసులో సూర్యాపేట పట్టణ సీఐ వీర రాఘవులు, సూర్యాపేట డీఎస్పీ పార్థ సారధి రూ. 16లక్షలు లంచం డిమాండ్ చేసి మే 12న ఏసీబీకి పట్టుబడ్డారు.
- నూతనకల్ మండలం మిర్యాలలో చక్రయ్యగౌడ్ హత్య కేసులో అప్పటి డీఎస్పీ డబ్బులు తీసుకొని నిందితులను ప్రోత్సహించడంతో పాటు హత్య కేసులో పాల్గొన్న నిందితులను పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీస్ బృందాన్ని కాదని తుంగతుర్తి సీఐకి బాధ్యతలు అప్పగించడం పట్ల పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో డీఎస్పీని డీజీపీ ఆఫీస్‌కు, సీఐని ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు.
- నూతనకల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఎస్‌ఐ వి.ప్రవీణ్‌కుమార్ అదే పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్‌ను లైంగికంగా వేధించడంతో సదరు మహిళా కానిస్టేబుల్ పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌ను శనివారం డీఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.
- నేరేడుచర్ల మండలం మేడారంలో ఓ భూవివాదంలో తమ హత్యకు కుట్ర చేశారంటూ ఒక వర్గం వారు ఈ నెల 19న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో మరోవర్గం వారిపై నేరేడుచర్ల ఎస్సై రవీందర్‌నాయక్ కేసు నమోదు చేసి స్టేషన్‌కి పిలిపించి తీవ్రంగా కొట్టారని బాధితులు ఆరోపించారు. అంతేకాదు అదే మండలంలోని కందులవారిగూడెంలో భూవివాదంలో ఎస్సై రవీందర్‌నాయక్ ఒక వర్గం వారిని విచారణ పేరుతో బాధితులను కొడుతున్నట్లు విమర్శలు వచ్చాయి. విచారణ పేరుతో ఎందుకు కొడుతున్నారని అడిగితే తమపైనా దురుసుగా ప్రవర్తించారంటూ స్వప్న అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.
- గతేడాది భూవివాదంలో గుర్రంపోడు మండలంలో జరిగిన ఓ మహిళ హత్య కేసులో ఎదుటి వారితో కుమ్మక్కై సూసైడ్ కేసుగా నమోదు చేశారు. ఆ కేసును ఎస్పీ శరత్‌చంద్రపవార్ విచారణ జరిపించారు. ఎస్సై, కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఆ తరువాత సీఐపైనా విచారణ జరిపించారు. పీఏపల్లి మండలం గుడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని కొట్టిన విషయంలో సీఐపై విచారణ జరిపి ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్.. పోలీసుల అత్యుత్సాహం

పోలీసుల అత్యుత్సాహం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ముఖ్యంగా నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి పట్టణ కేంద్రాల్లో పోలీసులు నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మద్యం తాగినా, తాగకపోయినా తనిఖీల సమయంలో దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. వాహనంతోపాటు సెల్ ఫోన్లు లాక్కోవడం, ఇష్టానుసారంగా మాట్లాడటం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. అసలు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే నిబంధనల ప్రకారం ఏం చేయాలన్నది కాకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వివాదాల కేంద్రంగా చింతపల్లి

చింతపల్లి మండలంలో గతంలో పనిచేసిన ఓ ఎస్సై భూవివాదంలో జోక్యం చేసుకున్నారు. ఆ కేసులో ఓ వృద్ధున్ని పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి కొట్టడం వల్లే అతను చనిపోయాడని ఆ వృద్ధుడి బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే పోలీసులు ప్రశ్నిస్తున్న సమయంలో వృద్ధునికి గుండెపోటు వచ్చిందని, పోలీసులు కొట్టినందున ఆయన చనిపోలేదని, గుండెపోటు కారణంగానే అతను చనిపోయాడని తేల్చారు. అయితే సదరు ఎస్సైని పోలీసు శాఖ సస్పెండ్ చేసింది. అయినా కొద్దినెలలకే రాజకీయ పలుకుబడితో ఆయన మరో కీలకమైన పోస్టింగ్ తెచ్చుకోగలిగారు.

క్లుప్తంగా

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం

- ఇబ్బందులు పడిన వాహనదారులు



విజయవాడ–హైదరాబాద్ హైవేపై తూప్రాన్‌పేట వద్ద నిలిచిపోయిన వాహనాలు

చౌటుప్పల్ రూరల్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామంలో ట్రాఫిక్ జాం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాలు.. సోమవారం అర్ధరాత్రి నల్లగొండ వైపు నుంచి సిమెంట్ లోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ తూప్రాన్‌పేట గ్రామంలో హైవేపై మరమ్మతులకు గురైంది. హైవేపై పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ట్రాఫిక్ జాం కాకుండా వాహనాలను పంపించారు. అయితే మంగళవారం తెల్లవారుజామున పోలీసులు ఘటనా స్థలం నుంచి వెళ్లిపోవడంతో మధ్యాహ్నం వరకు తూప్రాన్‌పేట గ్రామంలో హైదరాబాద్ వెళ్లే వైపు సుమారు 2 కి.మీ. మేర ట్రాఫిక్ జాం అయ్యింది. దీంతో హైదరాబాద్ వైపు వెళ్లాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ట్రాఫిక్ పోలీసులు, సివిల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని రోడ్డు పక్కకు తొలగించడంతో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదలిలాయి.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి బైక్ వస్తున్న కానిస్టేబుల్ ట్రాక్టర్‌ను ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన చివ్వెంల మండలం బీబీగూడెం గ్రామంలో సూర్యాపేట–ఖమ్మం రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం పాశ్యానాయక్ తండా గ్రామానికి చెందిన ధరావతు సోమాని(55) సూర్యాపేట సబ్ జైలులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం బైక్‌పై సూర్యాపేటకు వెళ్తుండగా.. మార్గమధ్యలో బీబీగూడెం వద్ద మండల కేంద్రం నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. వెనుక నుంచి బైక్‌పై వస్తున్న సోమాని అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొని కిందపడ్డాడు. అదే సమయంలో సూర్యాపేట వైపు వెళ్తున్న మరో బైక్ సోమాని పైనుంచి వెళ్లడంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు అతడిని సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వి. మహేశ్వర్ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

వలిగొండ: వలిగొండ మండలం ఏదుళ్లగూడెం రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన మంగళవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం తాజపూర్‌కు చెందిన గుళ్ళని పోచమ్మ (90) ఏదుళ్లగూడెంలో తన బంధువుల ఇంటికి వస్తుండగా.. గ్రామ సమీపంలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలిచి ఉండడంతో బ్రిడ్జి పైనుంచి రైలు పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

మన చేనేత.. ఘనత

కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు 13 మంది చేనేత కార్మికులు ఎంపిక

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేతలో విశేష ప్రతిభ కనబర్చిన కళాకారులను ప్రతి యేటా కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుతో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ సత్కరిస్తోంది. ఈ అవార్డుకు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు చేనేత కళాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ చేతులమీదుగా వారు రూ.25వేల నగదు పురస్కారం, మెమొంటో, ప్రశంసా పత్రం అందుకోనున్నారు.

జీవ వైవిధ్యం ప్రతిబింబించేలా మద్రాస్ ఇక్కత్ చీర



అవార్డు దక్కించుకున్న మద్రాస్ ఇక్కత్ చీర ఇదే..

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లికి చెందిన చేనేత కళాకారుడు మంగళపల్లి శ్రీహరి వినూత్న డిజైన్లతో మద్రాస్ ఇక్కత్ చీరను రూపొందించి ఉత్తమ వీవర్‌గా కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపికయ్యారు. ఏడాది పాటు కష్టపడి 234 కొయ్యలు, రిపిట్ లేకుండా ఆరు వరుసల్లో వైట్ బేస్ చీరలో ప్రకృతి అందాలతో పరవశించి నృత్యం చేస్తున్న అంబారీ, నెమలిని రూపొందించారు. అంతేకాక మధ్య మధ్యన మన తెలంగాణ పండుగను ప్రతిబించేలా బతుకమ్మ, పద్మాల డిజైన్లను వేశారు. డిజైన్లు స్పష్టంగా కన్పించేలా వైట్ బేస్ చీరలో ఆనంద, బ్లాక్, మెరూన్, పసుపు, ఆకుపచ్చ రంగులను వినియోగించారు. డిజైన్లను రూపొందించడం, వాటిని గ్రాఫ్‌పై గీయడం, అందుకనుగుణంగా చిటికి కట్టడం, మగ్గం నేయడం కోసం మూడు నెలలు కష్టపడినట్లు ఆయన పేర్కొన్నారు. అంతేకాక ఆయన నాలుగు మగ్గాలను పెట్టి నాలుగు కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నారు. తాను పడిన కష్టానికి తగిన గుర్తింపు వచ్చిందని శ్రీహరి ఆనందం వ్యక్తం చేశారు.

పోచంపల్లి డబుల్ ఇక్కత్ చీర..

చిట్యాల: చిట్యాల మండలం సుంకెనపల్లి గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు చిట్టిప్రోలు ధనుంజయ్య మగ్గంపై నేసిన పోచంపల్లి డబుల్ ఇక్కత్ తరహాలోని చీరకు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు దక్కింది. ఈ అవార్డుకు ఎంపిక చేసిన ప్రభుత్వానికి, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ధనుంజయ్యకు అవార్డు రావటం పట్ల చిట్యాల మండలానికి చెందిన పలువురు పద్మశాలీలు హర్షం వ్యక్తం చేశారు.



డబుల్ ఇక్కత్ చీర నేస్తున్న చిట్టిప్రోలు ధనుంజయ్య

డిజైనింగ్‌లో ప్రతిభ



మగ్గం నేస్తున్న గాజుల అనిల్

గట్టుప్పల్: చేనేత చీరల డిజైనింగ్‌లో ప్రతిభ కనబర్చిన గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన గాజులు అనిల్ కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు ఎంపికయ్యారు. ఆయన 2012 నుంచి పోచంపల్లి ఇక్కత్(జకార్డ్) చీరల బార్డర్లపై అన్ని రంగులతో డిజైన్లు వేస్తున్నారు. ఈ చీరలకు మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉంది. అనిల్ ప్రతిభను గుర్తించిన రాష్ట్ర చేనేత, జౌళి శాఖ అధికారులు ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అనిల్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

50 ఏళ్ల కష్టానికి దక్కిన ఫలితం



గుర్రం యాదయ్య

గట్టుప్పల్: గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు గుర్రం యాదయ్య గత 50 ఏళ్లుగా చేనేత వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. చేనేతలో కొత్త కొత్త డిజైన్లు తయారు చేస్తేనే మార్కెట్‌లో మంచి ఆదరణ ఉంటుందని గుర్తించి.. తన భార్య జయమ్మ సహకారంతో పోచంపల్లి డబుల్ ఇక్కత్ మల్బరీ సిల్క్‌తో వెరైటీ చీర తయారు చేశారు. ఇందుకు గాను ఆయన కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపికయ్యారు.

నలభై ఏళ్ల అనుభవానికి గుర్తింపు



చల్లమల్ల కృష్ణ

వలిగొండ: మండలంలోని గొల్లపల్లికి చెందిన చేనేత కార్మికుడు చల్లమల్ల కృష్ణ కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపికయ్యారు. గత 40 ఏళ్లుగా చేనేత కళాకారుడిగా పనిచేస్తున్న ఆయన తెల్ల రుమాల్, డబుల్ ఇక్కత్ 100% కాటన్ చీరలు నేస్తున్నారు. తన అనుభవానికి గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం తనను కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపిక చేసిందని ఆయన అన్నారు. అవార్డుకు ఎంపికైన కృష్ణను కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు అభినందించారు.

త్రీడీ ఎఫెక్ట్‌తో రూపొందించిన చీర



అవార్డుకు ఎంపికైన చీరను మడత వేస్తున్న భాస్కర్, విజయలక్ష్మి

సంస్థాన్ నారాయణపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని పుట్టపాక గ్రామానికి చెందిన సామల భాస్కర్ ఎంపికయ్యారు. భాస్కర్ తన 33 సంవత్సరాల చేనేత అనుభవంతో త్రీడీ ఎఫెక్ట్ ఉండేలా కొత్త డిజైన్‌తో చీరను రూపొందించారు. సాధారణంగా ఒక చీరకు 30 మెట్లు ఉంటే.. భాస్కర్ 1450 మెట్లతో నెమలి దేవత ఆకృతులతో గ్రాఫిక్ డిజైన్‌తో రూపొందించారు. నిలువు, 4అచ్చెలతో ప్యూర్ సిల్క్ చీరను 10 నెలల్లో తయారు చేశారు. ఈ చీర తయారీకి 7 రంగులను వాడినట్లు ఆయన పేర్కొన్నారు. తన భార్య విజయలక్ష్మి సహకారంతో కొత్త చీరను రూపొందించానని, దానికి అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని భాస్కర్ తెలిపారు. ఈ అవార్డుతో తమ చీరకు మార్కెటింగ్ ఏర్పడి తమ జీవనపాధికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అవార్డుకు ఎంపిక చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నతనం నుంచే జీతమున్నా..



మగ్గం నేస్తున్న అవ్వారి రవీందర్

చండూరు: చండూరు మండల కొండాపురం గ్రామానికి చెందిన అవ్వారి రవీందర్ తయారు చేసిన ఇక్కత్ రాజ్ కోట్ చీరకు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు దక్కింది. ఇవి వేరే దేశాలతో పాటు రాజస్తాన్, అహ్మదాబాద్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాను 10 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడే మగ్గం పనిచేసే వారి వద్ద జీతం ఉన్నానని, ఆ తర్వాత బొంబాయికి వలస వెళ్లి అక్కడ పదేళ్లు ఉండి సాంచన్‌లు నడిపి తిరిగి కొండాపురం గ్రామం వచ్చినట్లు రవీందర్ తెలిపారు. కొత్తగా వచ్చే డిజైన్లను గమనించి చీరలు తయారు చేయడం తనకు అలవాటని ఆయన పేర్కొన్నారు. 20 ఏళ్ల కిందటే 5 మగ్గాలతో చీరలు నేయించినట్లు వివరించారు. ప్రస్తుతం తనకు 69 ఏళ్లని, ఇన్నేళ్లకు తనకు గుర్తింపు లభించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

పదహారు ఆకృతులతో తేలియా రుమాల్‌పై..



మగ్గం నేస్తున్న గూడ పవన్

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పుట్టపాక గ్రామానికి చెందిన గూడ పవన్ పదహారు ఆకృతులతో తేలియా రుమాల్ అనే వస్త్రంతో చీర తయారుచేసి కొండ లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపికయ్యారు. ఈ చీర బంతిపూలు, రథం, త్రీడీ డిజైన్‌తో పాటు అనేక డిజైన్‌లతో కూడి ఉంటుంది. మడతలు పడకుండ మృదువైన పట్టును వాడినట్లు ఆయన తెలిపారు. రంగు వెలవని ఈ చీర తయారీకి రూ.75వేలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇదే చీరకు ఆయన జాతీయ చేనేత అవార్డు కూడా అందుకోనున్నారు. జాతీయ, రాష్ట్ర అవార్డులు రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

108 డిజైన్లు.. 29 రంగులు



తాను తయారు చేసిన చీరతో కర్నాటి కృష్ణయ్య

గట్టుప్పల్: ఎంతో శ్రమించి 108 డిజైన్లు, 29 రంగులతో చీరను తయారుచేశారు గట్టుప్పల్‌కు చెందిన కర్నాటి కృష్ణయ్య. ఆయన గత 40 ఏళ్లుగా చేనేత మగ్గంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. చేనేతలో కొత్తదనం సృష్టించాలనే తపనతో కృష్ణయ్య ఏడాది క్రితం 108 డిజైన్లు, 29 రంగులతో చీర తయారు చేయడం ప్రారంభించారు. నెలరోజుల క్రితం ఈ చీర తయారీ పూర్తయ్యింది. క్వాలిటీ, కలర్స్, డిజైన్స్‌ను పరిశీలించిన చేనేత శాఖ అధికారులు కృష్ణయ్యను కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపిక చేశారు. ఇన్నేళ్ల తన కష్టానికి సరైన గుర్తింపు దక్కడంతో కృష్ణయ్య ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లు.. ముగ్గురు అన్నదమ్ములకు అవార్డులు

చండూరు: చండూరు మండల కేంద్రానికి చెందిన చిలుకూరి శ్రీనివాసులు సహజ సిద్ధమైన రంగులతో డబుల్ ఇక్కత్ దుపట్టాను తయారు చేసి కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపికయ్యారు. శ్రీనివాసులు అన్న చిలుకూరి క్రిష్ణయ్య 2023లో, తమ్ముడు చిలుకూరి ధనుంజయ 2024లో కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డులు అందుకున్నారు. దాదాపు 35 సంవత్సరాలుగా ముగ్గురు అన్నదమ్ములు డబుల్ ఇక్కత్ పైనే ప్రావీణ్యం సంపాదించారు. మూడేళ్ల క్రితం వరకు రసాయన రంగులతో డబుల్ ఇక్కత్ వస్త్రాలు నేసినా ఆ తర్వాత నుంచి సహజ సిద్ధమైన రంగులకు మారి మంచి ఆదరణ పొందుతున్నారు. ఈ ఉత్పత్తులకు మంచి డిమాండ్ కూడా ఉంది. దుపట్టా తయారు చేసేందుకు రెండు నెలల సమయం పట్టిందని, శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై ముడి సరుకులు ఇచ్చి చేనేత కార్మికులను ప్రోత్సహిస్తే ఉత్పత్తిని పెంచి తక్కువ ధరల్లో వస్త్రాలు అందుబాటులో ఉంచేందుకు వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. తనకు అవార్డు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.



చిటికీపై డిజైన్ సెట్ చేస్తున్న శ్రీనివాసులు

న్యూ మ్యాట్రిక్ టిల్ శారీ ఎంతో స్పెషల్



అవార్డు వచ్చిన న్యూ మ్యాట్రిక్ టిల్ ఇక్కత్ చీర

చండూరు: న్యూ మ్యాట్రిక్ టిల్ ఇక్కత్ విధానంలో చీర నేసి చండూరు మండల కేంద్రానికి చెందిన కర్నాటి సద్గురు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపికయ్యారు. ఈ స్పెషల్ ఇక్కత్ చీర నేసేందుకు ఐదు నెలల సమయం పట్టిందని ఆయన పేర్కొన్నారు. డిజైన్ ఫైనల్ చేయడం, మగ్గంపై డిజైన్ నూలుపై సెట్ చేయడానికే రెండు నెలల సమయం పట్టిందన్నారు. 25 ఏళ్లుగా మగ్గం నేస్తున్నానని, తనకున్న అనుభవంతో కొత్త డిజైన్లతో చీరలు రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ చీర ధర రూ.25వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ తరహా చీర నల్లగొండ జిల్లాలో తానొక్కడినే చేశానని, అంత ప్రత్యేకం కాబట్టే అవార్డుకు ఎంపికైందని ఆయన తెలిపారు. సబ్సిడీ ముడి సరుకుల డిపో నల్లగొండ లేదా చౌటుప్పల్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



మగ్గంపై చీర నేస్తున్న కర్నాటి సద్గురు

కొత్త డిజైన్ అవార్డు తెచ్చింది



మగ్గం నేస్తున్న కొలను శంకర్

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన కొలను శంకర్ లెనిన్ డబుల్ ఇక్కత్ చీర తయారుచేశారు. లెనిన్ డబుల్ ఇక్కత్ చీర నేయడం దేశంలో ఇదే మొదటిసారి. ఈ చీర 15 షేడులు, సున్నితమైన దారాలతో రంగు వెలిసిపోని చీర. ఈ చీర డిజైన్ కోసం సంవత్సరం కాలం పట్టిందని శంకర్ తెలిపారు. చీర తయారీకి రూ.50వేలు ఖర్చు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తన 30సంవత్సరాల అనుభవంలో ఎన్నో రకాల చీరలు తయారు చేశానని, కానీ అవార్డు కోసం ఎప్పుడూ దరఖాస్తు చేసుకోలేదన్నారు. ఈ చీరకు దరఖాస్తు చేసుకోవడంతో కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

సహజ రంగులతో చీర తయారుచేసి..



మునగపాటి శ్రీనివాస్

గట్టుప్పల్: గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు మునగపాటి శ్రీనివాస్ సహజ రంగులతో డబుల్ ఇక్కత్ చీర తయారు చేశారు. చేనేతలో కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగాలనే లక్ష్యంతో ఉన్నట్లు శ్రీనివాస్ తెలిపారు. తనకు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక ముందు కూడా అనేక రకాల కొత్త డిజైన్లతో చీరలు తయారు చేస్తానన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మంగళవారం 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మాల్‌కు చెందిన జర్పుల వెంకటేష్ పెద్దవూర మండలంలో 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం సేకరించి కారులో తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

SPOKEN ENGLISH

■ ప్రతిరోజు ఒక గంట మాత్రమే 45 రోజుల్లో సింపుల్ టెక్నిక్స్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకోండి. చిరునామా: ఛాలెంజ్ స్పోకెన్ ఇంగ్లీష్ సెంటర్, సావర్కర్ నగర్ ఫ్లై ఓవర్ దగ్గర నల్గొండ సెల్ నెంబర్ 8500119574. కేజీ టూ పీజీ ఇంగ్లీష్ బయాలజీ సోషల్ ట్యూషన్ చెప్పబడును. [SCA25007042]

Services

HEALTH CARE

■ ఉచిత హెల్త్ చెకప్. మన నల్లగొండ ప్రజలకు 5000 రూపాయల ఖరీదు చేసే పరీక్షలు. మా వద్ద లేదా మీ ఇంటి దగ్గర ఉచితంగా చేయబడును. సంప్రదించండి. ఫ్రెండ్స్ వెల్ నెస్ సెంటర్, నందీశ్వర కాలనీ, నల్లగొండ. ఫోన్ నెం. 8500119574. [SCA25007045]

Wanted

■ పవర్ ప్లాంట్ నందు B.Tech, డిప్లొమా ITI డిగ్రీ (All) స్త్రీ/పు కావలెను. జీ. 18–30 వేలు. రూమ్ + ఫ్రీ మీల్స్ కలదు. సం.ప్ర. Ph: 99595 66264 [SCA 25007047]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన కోరంతో! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
సంప్రదించండి
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

విద్యుత్ మోటార్ల చోరీ నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ సురేష్

కట్టంగూర్: దొంగిలించిన విద్యుత్ మోటార్లను ట్రాలీ ఆటోలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా కట్టంగూర్ మండల కేంద్రంలో మంగళవారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో నల్లగొండ ఏఎస్పీ జి. సురేష్, మంగళవారం విలేకరులకు వెల్లడించారు. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణానికి చెందిన ఎడ్ల సురేష్, నాగిళ్ల ముత్తయ్య, గోపగాని రమేష్, ఆవుల రాజాలు, నాగిళ్ల ఎల్లయ్య కలిసి ఇటీవల కట్టంగూర్ మండలం ఈదులూరు గ్రామ శివారులోని వెంకటేశ్వర డెయిరీ ఫాం వద్ద, అయిటిపాముల గ్రామ శివారులో, శాలిగౌరారం మండల పరిధిలో వ్యవసాయ బావులు, ఫాంహౌజ్‌ల వద్ద విద్యుత్ మోటార్లు, పైపులు చోరీ చేశారు. చోరీ చేసిన విద్యుత్ మోటార్లు, పైపులను ఆటోలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మంగళవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద నుంచి 14 విద్యుత్ మోటార్లు, 33 బోర్ పైపులు, 8 బ్యాటరీలు, రాగి వైరు, మంచం, రెండు సీలింగ్ ఫ్యాన్లులు, రెండు కుర్చీలు, ఫ్రిజ్, చోరీకి ఉపయోగించిన ట్రాలీ ఆటో, రూ.1,74,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. అంతేకాకుండా నిందితుల ఇంటి వద్ద ఉన్న మిగతా వస్తువులను సైతం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్‌తో పాటు ఐదుగురు నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించినట్లు తెలిపారు. ఎడ్ల సురేష్, నాగిళ్ల ముత్తయ్య మూడేళ్ల క్రితం తిప్పర్తి మండల పరిధిలో ఆగి ఉన్న రైలు బోగీ నుంచి 39 బ్యాటరీలను చోరీ చేసి జైలుకు వెళ్లి వచ్చినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. నిందితులను రిమాండ్ తరలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న పోలీసులను ఏఎస్పీ అభినందించారు. ఈ విలేకరు సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ మునుగోటి రవీదర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ పట్టణంలో కార్డెన్ సెర్చ్

- 300 మంది పోలీసులతో సోదాలు
- 250 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- గంజాయి అనుమానితుల అరెస్ట్
- పాత నేరస్తుల గుర్తింపు



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, డీఎస్పీ శివరాంరెడ్డి

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 20 మంది ఎస్‌ఐలు, 300మంది పోలీస్ సిబ్బంది కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తాటికల్ రోడ్డులోని ఎస్సీ కాలనీ, వడ్డెర కాలనీ, మొండివారి కాలనీల్లోని ఇళ్లను తనిఖీ చేశారు. ఉదయం 7 గంటల వరకు ఈ కార్డన్ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని ద్విచక్ర వాహనాలను, గంజాయి అనుమానితులను, వివిధ కేసుల్లో ఉన్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కార్డెన్ సెర్చ్ ముగిసిన తర్వాత నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ నకిరేకల్‌కు చేరుకుని తాటికల్ రోడ్డులోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ నందు ఉంచిన పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ముందుస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగానే కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలను సమన్వయం చేస్తూ శాంతిభద్రతలను కాపాడటం కోసం కార్డెన్ సెర్చ్, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 130 బైక్‌లు, 10 ఆటోలు, మరో 120 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 8 మంది పాత నేరస్తులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 18 మంది గంజాయి అనుమానితులను కూడా పట్టుకున్నామన్నారు. ముగ్గురు నేపాల్ దేశస్తులను గుర్తించినట్లు తెలిపారు. ఒక షెడ్డులో 15 గోవులను గుర్తించి పట్టుకున్నామన్నారు. ఆయా కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ఇళ్లు అద్దెకు ఇచ్చేముందు పూర్తి వివరాలు తెలుసుకున్నాకే అద్దెకు ఇవ్వాలని కోరారు. ఎవరైనా గంజాయి సేవిస్తున్నట్లు, విక్రయించినట్లు తెలిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో శాలిగౌరారం, చండూరు, నల్లగొండ ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్ల సీఐలు కొండల్ రెడ్డి, రాఘవరావు, ఆదిరెడ్డి, కరుణాకర్, మహాలక్ష్మయ్య, వివిధ మండలాల ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీకి యత్నం

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలోని ఓ పాత ఇంట్లో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి చోరీకి యత్నించాడు. పోలీసులు, ఇంటి యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని కామునికంత ప్రాంతానికి చెందిన నాయిని విద్యాసాగర్ శిథిలావస్థకు చేరిన తన పాత ఇంటిని వదిలి స్థానిక హౌజింగ్‌బోర్డు కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. అయితే రహదారి వెంట ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే గుర్తుతెలియని వ్యక్తి విద్యాసాగర్ ఇంట్లోకి చొరబడి సామగ్రిని చోరీ చేసేందుకు యత్నించాడు. స్థానికులు గమనించి అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీ నారాయణ తెలిపారు.

పారిపోయిన విద్యార్థుల ఆచూకీ లభ్యం

- రైలులో హైదరాబాద్‌కు వెళ్లి.. తిరిగి రైలులోనే మిర్యాలగూడకు రాక
- మదర్సా నిర్వాహకులకు అప్పగించిన పోలీసులు

మిర్యాలగూడ టౌన్: మదర్సా గోడ దూకి పారిపోయిన ఇద్దరు విద్యార్థుల ఆచూకీ మంగళవారం లభ్యమైంది. మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ పంచాయతీలోని మదర్సాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే ఉస్మాన్ అఖిల్, ఎస్‌కే అయ్యూబ్ చదువుకుంటున్నారు. వీరిద్దరు సోమవారం అర్ధరాత్రి 1:15గంటలకు వారిద్దరు మదర్సా గోడ దూకి నేరుగా మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున గుంటూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ట్రైన్‌లో హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ సాలార్జంగ్ మ్యూజియం చూసి ఫలక్‌నుమా ట్రైన్‌లో తిరిగి మిర్యాలగూడకు చేరుకున్నారు. ఇద్దరు విద్యార్థులు అనుమానస్పదంగా ఉండటంతో స్థానికులు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. ఇద్దరు విద్యార్థులను మదర్సా నిర్వాహకులకు అప్పగించినట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపారు.